క్లుప్తంగా

నేడు అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ శివారు బోడపాడు గ్రామంలో ఉన్న అభయాంజనేయస్వామి దేవస్థానం 26వ వార్షికోత్సవ కార్యక్రమం గురువారం జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు స్వామివారిని దర్శించి ఆశీస్సులు పొందాలని విజ్ఞప్తి చేశారు.

4,900 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు



విజయవాడరూరల్: మండలంలో రబీ సీజన్‌లో సాగుచేస్తున్న పొలాల్లో 4,900 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేసినట్టు మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు తెలియజేశారు. ఆయన మండలంలో బుధవారం నున్న, రామవరప్పాడు, గూడవల్లి గ్రామాల్లో వరి, తెల్లజొన్న, అపరాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 3,500 ఎకరాల్లో వరి, 1300 ఎకరాల్లో తెల్లజొన్న, 160 ఎకరాల్లో అపరాలు, చెరకు పంట సాగులో ఉందన్నారు. మిగిలిన రైతులు కూడా ఈ-క్రాప్ నమోదు చేయాలన్నారు.

ఇద్దరు వ్యక్తులపై బైండోవర్ కేసు నమోదు

పెనమలూరు: దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు బుధవారం బైండోవర్ కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటమటకు చెందిన వాస ప్రేమ్‌కుమార్, కానూరు సిద్ధిఖ్‌నగర్‌కు చెందిన వి.నవీన్‌కుమార్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా వీరిద్దరిపై పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు.

23న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ బి.భార్గవి తెలియజేశారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సమీక్ష ఉంటుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సమావేశానికి విధిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

మూగజీవాలను నిర్బంధించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: మూగజీవాలను నిర్బంధించి గేదె మరణానికి కారకుడైన వ్యక్తిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు సంజీవయ్యనగర్‌కు చెందిన గాదె వెంకటేశ్వరమ్మ తన పాడి గేదెలకు పెదపులిపాక పరిధి కృష్ణానది లంక భూముల్లో గడ్డి మేపుతోంది. ఈ విషయమై లంక భూముల సొసైటీ సభ్యులతో గతం నుంచి వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 11వ తేదీన తన పాడిగేదెలను లంక భూముల్లో మేపుతుండగా సొసైటీ సభ్యుడు నాగలి శ్రీను అభ్యంతరం చెబుతూ గేదెలను కట్టివేశాడు. అందులో ఒక గేదె మంగళవారం మృతి చెందింది. ఈ ఘటనపై వెంకటేశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

జగనన్న కాలనీలో నిర్మాణాల పరిశీలన

ఉయ్యూరు: జగనన్న లే అవుట్‌లో గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్‌డీఓ విజయ్‌కుమార్ ఆదేశించారు. పట్టణంలోని నాగన్నగూడెం ప్రాంతంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీని బుధవారం ఆయన పరిశీలించారు. గృహ నిర్మాణాల పురోగతి, మౌలిక వసతుల కల్పనపై కమిషనర్ వెంకటేశ్వరరావుతో చర్చించి లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆర్థిక అక్షరాస్యత అవసరం

కంకిపాడు: నేటి పరిస్థితుల్లో ఆర్థిక అక్షరాస్యత అవసరమని వణుకూరు ఇండియన్ బ్యాంకు మేనేజరు షేక్ నాగూర్ బేగం అన్నారు. కంకిపాడులో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా సూచనలతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నాగూర్ బేగం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత విషయంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంకు ఖాతాలను తెరిచి పొదుపు అలవర్చుకోవాలని సూచించారు. ఆర్థిక ప్రణాళికలను రూపొందించుకుని కుటుంబాలను ఉన్నతి వైపు నడిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, ప్రతినిధులు పి.రాజేష్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ శాస్త్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యతపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

రూ.వంద కోట్లతో అమృత్-2 పథకం

- తాడిగడప మునిసిపాలిటీలో అమలు
- ఎంపీ నిధులు మరో రూ.60 లక్షలు కేటాయిస్తానని హామీ
- ఎంపీ వల్లభనేని బాలశౌరి వెల్లడి



కానూరు హైస్కూల్ వద్ద రూ.88 లక్షలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: డాక్టర్ వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీ అభివృద్ధికి అమృత్-2 పథకం అమలు చేస్తామని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి వెల్లడించారు. రూ.88 లక్షలతో నిర్మించనున్న కానూరు నుంచి మురళీనగర్‌కు సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.14 లక్షలతో మురళీనగర్‌లో నిర్మాణం చేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీ కొత్తగా ఏర్పడటంతో కనీస మౌలికవసతులు కల్పించాలని చర్యలు చేపట్టామన్నారు . డ్రైనేజీలు, రోడ్లు, తాగునీటి అవసరాలు తీర్చడానికి కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్ అందజేయడంతో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని వివరించారు. అమృత్-2 పథకం కింద తొలి విడతగా రూ.17 కోట్ల నిధులు విడుదల అయ్యాయన్నారు. దీంతో కృష్ణాజలాలు కానూరుకు అందే విధంగా చర్యలు తీసుకోవటమే కాకుండా ఉచిత కుళాయి కనెక్షన్‌లు ఇవ్వనున్నామన్నారు. రానున్న రోజుల్లో మరో రూ.100 కోట్లు నిధులు వస్తాయన్నారు. ఎంపీ నిధుల కింద తాను రూ.60 లక్షలు తాడిగడప మునిసిపాలిటీకి ఇస్తానని హామీ ఇచ్చారు.

టీడీపీ హయాంలో అరచేతిలో వైకుంఠం

గత టీడీపీ ప్రభుత్వం ప్రజలను అనేక విధాలుగా మభ్యపెట్టి అరచేతిలో వైకుంఠం చూపి అభివృద్ధిని తుంగలో తొక్కిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం ప్రజల కనీస అవసరాలు తీర్చలేదన్నది స్పష్టమన్నారు. కానూరు గ్రామంలో గత ప్రభుత్వం ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని ఆరోపించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అక్కడక్కడ పనులు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గత మూడేళ్లలో కానూరులో రూ.35 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. తాడిగడప మునిసిపాలటీ అభివృద్ధికి తాను ఎంపీతో కలిసి పని చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, టిడ్కో డైరెక్టర్ పతివాడ రాఘవరావు, మాజీ సర్పంచి అన్నే వేణుగోపాలకృష్ణ మూర్తి, వైఎస్సార్ సీపీ నేతలు నెర్సు సతీష్, తాళ్ల నరేంద్ర, వేమూరి బాలకృష్ణ, చాంద్‌బాషా, అంగిరేకుల సీతారామయ్య, బండెల రాజు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు ప్రభుత్వ పాలన

- ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



కానూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: ప్రజలకు చేరువగా ప్రభుత్వ పాలన అందిస్తూ ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన బుధవారం కానూరు మురళీనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలు అమలు చేసిన బ్రోచర్ అందజేశారు. స్థానికులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి గ్రామాల్లో ప్రజాపాలన అందుబాటులోకి తీసుకు వచ్చారన్నారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వచ్చి ప్రజల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేస్తున్నారని వివరించారు.

పేదలకు జగనన్న భరోసా...

జగనన్న పాలనలో పేదలకు భరోసా ఏర్పడిందని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ప్రభుత్వ పాలనపై ప్రతిపక్ష టీడీపీ బురదజల్లి పేదల పొట్ట కొట్టాలని కుట్ర పన్నుతోందని ఆరోపించారు. టీడీపీ పాలనలో పేదల కష్టాలు అసలు పట్టించుకోలేదని, పేదవాడు మరింత పేదవాడయ్యాడని తెలిపారు. టీడీపీ పాలనలో రంగుల ప్రపంచం చూపించారని ఆచరణలో ఏదీ అమలు చేయలేదని విమర్శించారు. ప్రజల కష్టాలను తమ ప్రభుత్వం తీరుస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాడిగడప మునిసిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు పి.రాఘవరావు, ఈడే చాముండేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు చాంద్‌బాషా, సిద్దిఖ్, వేమూరి బాలకృష్ణ, తాళ్ల నరేంద్ర, మజ్జి శివ, దాసరి రవి, కోనపరెడ్డి రమేష్, మొవ్వా యువరాజ్, కాట్రగడ్డ శ్రీకాంత్, సింహాద్రి రాజు, పెదపూడి శ్రీను, శివప్రసాద్, వీర్ల గోపాలం, భీమవరపు శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

17న దివ్యాంగులకు వైద్యశిబిరం

కంకిపాడు: ఈనెల 17వ తేదీన ఉయ్యూరు పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఐఈ రిసోర్సు టీచర్లు పీవీడీ నాగేశ్వరి, ఎం.దీప్తి తెలిపారు. వారు బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటుచేశారన్నారు. అన్ని రకాల వైకల్యాల నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, ఉపకరణాల పంపిణీకి చర్యలు తీసుకుంటారని తెలిపారు. దివ్యాంగులైన పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 63004 28467, 94943 54322 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం నార్త్ సౌత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధి సూరపనేని వెంకటరత్నం 100 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు తలా రూ.25 వేల చొప్పున ఉపకార వేతనాలు అందజేశారు. విద్యార్థులు ప్రతిభ చూపితే వారి ఉన్నత చదువులకు అనేక సంస్థలు ముందుకు వచ్చి ఉపకార వేతనాలు అందిస్తాయన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, నిర్వాహకురాలు ఉషారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా షిరిడి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో బుధవారం షిరిడి సాయిబాబా ఆలయం 15వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు కాగడ హారతి, పంచామృతాభిషేకం, అలంకరణ, 9 గంటలకు నవధాన్యాల సమర్పణ, శ్రీ గణపతి పూజ, అరటి పండ్లు, గులాబీ పుష్పాలతో పూజ చేశారు. దాదాపు ఐదు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం బాబాకు గ్రామోత్సవం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తాడిగడపలో పూజలు చేస్తున్న భక్తులు

గారపాడులో తాగునీటి బోరు ఏర్పాటు

ఉంగుటూరు: గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ప్రజా ప్రతినిధుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు తెలిపారు. గారపాడులో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామీణ యోజన నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన రోటరీ బోర్‌వెల్, సబ్ మెర్సిబుల్ పనులు పూర్తయ్యాయి. బోర్ ట్రయల్‌రన్ పనులను బుధవారం ఎంపీడీవో పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా గారపాడులో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, స్థానిక ఎమ్మెల్యే వంశీమోహన్ చొరవతో తాగునీటి సమస్యను పరిష్కరించామని ఎంపీడీవో చెప్పారు. గ్రామస్తులు ఎమ్మెల్యే వంశీమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడాలి సుకన్య, ఉప సర్పంచ్ కొండలరావు, పీఆర్ ఏఈ బాబురావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ



ట్యాబ్‌లు అందుకున్న ఉపాధ్యాయులతో హెచ్‌ఎం అనిత

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. పాఠశాలలో 8వ తరగతి బోధించే 20 మంది ఉపాధ్యాయులకు హెచ్‌ఎం సీహెచ్ అనిత ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటి రూ.32 వేలు విలువైన ట్యాబ్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను ఉపాధ్యాయులు అందించాలని కోరారు.

పరిహారం కోరుతూ మల్లవల్లి నిర్వాసితుల ఆందోళన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడ భూసేకరణలో నష్టపరిహారం అందని నిర్వాసితులు బుధవారం ఆందోళన నిర్వహించారు. మల్లవల్లి సాగుదారులు పంతం కామరాజు ఆధ్వర్యంలో పారిశ్రామికవాడలోని రోడ్లను దిగ్బంధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సత్వరం నష్టపరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన సాగుదారుల నుంచి స్వీకరించిన అర్జీలపై విచారణ పూర్తి చేసి న్యాయం చేయాలని కోరారు.

ఆర్థిక మోసాలపై అప్రమత్తం

కంకిపాడు: ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కేడీసీసీ బ్యాంకు కంకిపాడు బ్రాంచ్ మేనేజరు సౌమ్య అన్నారు. నాబార్డు ఆర్థిక సౌజన్యంతో కళాజాతా కార్యక్రమం బుధవారం కుందేరు గ్రామంలో నిర్వహించారు. కళాభారతి బిళ్లపాడు కళాబృందం ఆర్థిక మోసాలు, నగదు రహిత లావాదేవీలు, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, రుణాలపై అవగాహన కల్పించారు. బ్రాంచ్ మేనేజరు సౌమ్య మాట్లాడుతూ బ్యాంకులు అందిస్తున్న సేవలను వినియోగించుకుని, ఆర్థిక అవసరాలను తీర్చుకుంటూ ఉన్నతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్రాంచ్ సూపర్‌వైజర్ భవాని, కుందేరు సొసైటీ అధ్యక్షుడు ఆకుల రంగారావు,కార్యదర్శి పద్మనాభం , కళాజాతా బృందం ఎం.శేఖర్‌బాబు, ఎం.తిరుపతి కుమార్, వి.రమేష్, వై.వీరయ్య పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం

ఆయుష్ శాఖ ఆర్‌డీడీ వెంకటకృష్ణ

కంకిపాడు: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయుష్‌శాఖ ఆర్‌డీడీ డాక్టర్ ఆర్.వెంకటకృష్ణ అన్నారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరం కోలవెన్నులోని కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. శిబిరాన్ని ఆర్‌డీడీ డాక్టర్ వెంకట కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి జీవన విధానాన్ని అవలంబిస్తే అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేదంలో సమర్థంగా వైద్యసేవలు అందుతున్నాయన్నారు. ప్రజలు ఆయుర్వేదంపై అపోహలు విడనాడి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 890 మంది రోగులకు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. 50 ఏళ్లు నిండిన వారికి ఎముకల పటిష్టత పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కోలవెన్ను ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ పి.నీలిమ, వైద్యాధికారులు డాక్టర్ ఎం.మురళీబాబు, డాక్టర్ భారతి, డాక్టర్ రత్నమాణిక్యం, డాక్టర్ మౌళినాయక్, డాక్టర్ లీలారాణి రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో శ్రీసాయి ధన్వంతరి ఏజెన్సీ ప్రతినిధి పి.శ్రీనివాసరావు, సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, ఎంపీటీసీ తోకల ఉమాదేవి, సగర కార్పొరేషన్ డైరెక్టర్ సక్కా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు టెక్కెం సతీష్‌కుమార్, కంచర్ల శేషగిరి, కంచర్ల వెంకటరావు, కొప్పరాజు సురేష్, కొలుసు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



కోలవెన్నులో ఉచిత మెగా వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న ఆయుష్ శాఖ ఆర్‌డీడీ వెంకటకృష్ణ

రంగన్నగూడెం మాజీ సర్పంచ్ మైనేని గోపాలరావు మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఇటీవల వంటగ్యాస్ సిలిండర్ పేలుడు సంభవించటంతో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాపులపాడు మండలం రంగన్నగూడెం మాజీ సర్పంచ్ మైనేని గోపాలరావు (94) బుధవారం మృతి చెందారు. పదిరోజుల క్రితం ఇంట్లో గ్యాస్ లీకై పెద్ద శబ్దంతో పేలుడు సంభవించిన ఘటనలో గోపాలరావు తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. చిన్నఅవుటపల్లిలో పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలలో కాలిన గాయాలకు చికిత్స పొందుతున్న గోపాలరావు బుధవారం ఆకస్మిక గుండెపోటుతో మరణించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సుమారు 20 ఏళ్ల పాటు రంగన్నగూడెం గ్రామ సర్పంచ్‌గా మైనేని విశేష సేవలు అందించారు. ప్రధానంగా రంగన్నగూడెం, సింగన్నగూడెం గ్రామాలకు ఆర్ అండ్ బీ రహదారులను ఏర్పాటు చేయటంలో కీలకంగా వ్యవహరించారు. ఆయన మృతదేహానికి సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు నివాళి అర్పించారు.

జగనన్న లేఅవుట్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

ఉంగుటూరు: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని, లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు ప్రారంభించాలని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు అన్నారు. ఉంగుటూరు జగనన్న కాలనీల్లో జరుగుతున్న మెరక పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు నాణ్యతతో చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ ఆదేశాల మేరకు జగనన్న లేఅవుట్‌లు అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. ఉంగుటూరులో 125 ప్లాట్లు ఉన్న లేఅవుట్‌లో రూ.30 లక్షలతో మెరక పనులు ప్రారంభించినట్లు తెలిపారు. వారం రోజుల్లో పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు సమకూర్చి గృహనిర్మాణాలు చేపట్టేందుకు అనువుగా అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.వరప్రసాద్, హౌసింగ్, పీఆర్ ఏఈలు సురేష్, బాబూరావు, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.



ఉంగుటూరులో మెరక పనులు ప్రారంభించిన ఎంపీడీవో శేషగిరిరావు

యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

అమెరికాలోని టెక్సాస్ నగర బిషప్ మైఖేల్ ఓల్సన్

గన్నవరం రూరల్: యేసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయమని అమెరికాలోని టెక్సాస్ నగర బిషప్ మైఖేల్ ఓల్సన్ అన్నారు. భారతదేశ పర్యటనలో భాగంగా విజయవాడ మేత్రాసనంలోని పల్లోటిన్స్ సంస్థకు చెందిన ముస్తాబాద విచారణను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు, విశ్వాసులు, మరియదళం సభ్యులు యూత్ సభ్యులు ఓల్సన్‌ను గ్రామ పొలిమేరల నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. బిషప్ కార్యదర్శి ఫాదర్ థామస్ జోన్స్ విశ్వాసులకు ఆశీర్వాదాలు ఇచ్చి ప్రార్థన చేశారు. ఆంధ్రా, తెలంగాణ పలోటిన్స్ సభ ప్రాంతీయ అధికారి మహా రెవరెండ్ బాలాజీ పోయాళ్ళ దేవుని ఎడల భయభక్తులు కలిగి ఉండాలని చెప్పారు. పుణ్యక్షేత్ర రెక్టర్ రెవరెండ్ ఫాదర్ అంతోని బాలజోసఫ్ అతిథులను దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.



టెక్సాస్ నగర బిషప్ ఓల్సన్‌ను సత్కరిస్తున్న రెవరెండ్ ఫాదర్ బాలజోసఫ్ అంతోని

ఒత్తిడిని అధిగమిస్తే విజయం సాధ్యమే

డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ డి.దేవానందరెడ్డి

కంకిపాడు: ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం సాధ్యమవుతుందని డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ డి.దేవానందరెడ్డి అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆరో తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఇంకా పరీక్షలకు 50 రోజులు మాత్రమే సమయం ఉందన్నారు. సిలబస్ ఇప్పటికే పూర్తయ్యిందని, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపుదలకు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మోడల్ టెస్ట్ పేపర్లపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పరీక్షలకు సన్నద్ధం చేసేలా సూచనలు ఇచ్చామన్నారు. విద్యార్థులు తమ జీవితంలో పదేళ్ల పడ్డ కష్టానికి ప్రతిఫలం దక్కే సమయం ఇది అని అన్నారు. అర్థం చేసుకుంటూ చదివితే ఎప్పటికీ పాఠ్యాంశం మర్చిపోరన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, పి.నరేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలపై సమీక్షిస్తున్న దేవానందరెడ్డి

పాలీసెట్ పోస్టర్ ఆవిష్కరణ

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం పాలీసెట్-2023 పోస్టర్‌ను ప్రిన్సిపాల్ అట్లూరి పద్మావతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్తగా కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ కోర్స్‌లను కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.



కంకిపాడు వద్ద జాతీయ రహదారిపై కమ్మేసిన పొగమంచు



ఈడుపుగల్లు వద్ద నివాసాలపై ఉదయం 9 గంటలకు సైతం తొలగని మంచు

పుడమిపై పరుచుకున్న మంచు దుప్పటి

పుడమిపై మంచు దుప్పటి పరుచుకుంది. బుధవారం ఉదయం 9.30 గంటల వరకూ మంచుతెరలు వీడలేదు. ప్రజలను చలి గజగజలాడించింది. మంచు తుంపరతుంపరలుగా పడుతూ హిమపాతంలా కురిసింది. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులు ఫ్లడ్‌లైట్లు వేసుకుని మరీ రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

-కంకిపాడు